మున్సిపల్ అధికారుల మధ్య కోల్డ్‌వార్!

- పిఠాపురంలో డీఈఈని ప్రభుత్వానికి సరెండర్ చేసిన కమిషనర్
- కమిషనర్ ఉత్తర్వులు సస్పెండ్ చేసిన హైకోర్టు
- విధుల్లో చేరిన డీఈఈ
- డీఈఈ చాంబర్‌కు తాళాలు..
- వాటర్‌వర్క్స్ నుంచి విధులు

అప్పుడలా.. ఇప్పుడిలా



- పోలింగ్ ముందుకు ఒకలా... ఓటింగ్ తర్వాత ఇంకోలా వైసీపీ పెద్దల మాటలు
- నాడు లబ్ధిదారులకు సొమ్ములు అందకపోతే ఏదో జరిగిపోతోందన్న వైసీపీ నేతలు
- నూరుశాతం డబ్బులు సిద్ధమని గొప్పలు
- నేటికి పదిశాతం నిధులు కూడా విడుదల కాని వైనం
- నిన్ను ఎలా నమ్మేది జగన్ అంటున్న ప్రజలు
- అస్మదీయ కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లింపు
- వైసీపీ ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం

పిఠాపురం, మే 18: ఎన్నికలకు కొన్ని నెలల ముందు సంక్షేమ పథకాల నిధుల చెల్లింపు కోసమంటూ సీఎం జగన్ పలుమార్లు బటన్‌లు నొక్కారు. కానీ ఒక్కపైసా కూడా విడుదల చేయలేదు. సరిగ్గా పోలింగ్‌కు నాలుగు రోజులు ముందు తెగ హడావుడి చేసేశారు. ఆపై ఎన్నికల కమిషన్, టీడీపీ అధినేత చంద్రబాబు పేదలకు డబ్బులు ఇవ్వకుండా అడ్డుకున్నారంటూ ప్రచారం సాగించారు. హైకోర్టుకు వెళ్లారు. పోలింగ్‌కు రెండు రోజులు ముందు ఇవ్వడానికి, ముగిసిన వెంటనే ఇవ్వడానికి తేడా ఏముందంటూ రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని, అందుకు ఎటువంటి అనుమతులు తీసుకోనక్కర్లేదని ఈసీ స్పష్టత ఇచ్చింది. పోలింగ్ ముగిసిన తర్వాత నిధుల విడుదలలో ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది. అస్మదీయ కాంట్రాక్టర్లకు మాత్రం వేలాది కోట్ల రూపాయిల బిల్లులను ఆఘమేఘాలపై చెల్లించేస్తున్నారు. విషయం గవర్నర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. అయినా పోలింగ్ ముగిసిన తర్వాత ఓటర్లు అవసరం తమకు లేదనుకున్న వైసీపీ సర్కార్ అవసరమైన నిధుల్లో కేవలం పదిశాతం మాత్రమే విడుదల చేసింది.

సార్వత్రిక ఎన్నికలకు ఐదు నెలల ముందు పది పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ము జమచేస్తున్నామంటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఖర్చుతో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి సీఎం జగన్ ఆర్భాటంగా బటన్‌లు నొక్కారు. నేరుగా మీ ఖాతాల్లోకి డబ్బులు పడిపోతున్నాయంటూ చెప్పుకొచ్చారు, నెలలు గడిచినా ఏడు సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులు లబ్ధిదారులకు అందలేదు. ప్రభుత్వం ఈ విషయం మరిచిపోయినట్లు నటించింది. ఎన్నికల పోలింగ్ తేదీ మే 13కు ఐదు రోజులు ముందు సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయాలని, ఇవి లబ్ధిదారులకు అందకపోతే ఏదో జరిగిపోతోందంటూ జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది. ఇది లబ్ధిదారులను ప్రలోభాలకు గురిచేయడం వంటిదేనని చెప్పి ఈసీ తిరస్కరించింది. పేదలకు డబ్బులు ఇస్తోంటే ఈసీ, టీడీపీ అధినేత చంద్రబాబు అడ్డుకున్నారంటూ జగన్ అండ్ కోగోబెల్ ప్రచారాలకు దిగింది. హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఈసీ పోలింగ్ ముగిసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాలకు నిధులు జమ చేయవచ్చునని, ఇందుకు అనుమతులు అవసరం లేదని తేల్చి చెప్పింది. పోలింగ్ ముగిసి నాలుగు రోజులు గడిచాయి. అయినా సొమ్ములు మాత్రం విడుదల కాలేదు. రాష్ట్ర గవర్నర్ జోక్యంతో రెండు పథకాలకు అదీ అరకొరగా పదిశాతం నిధులు విడుదల చేశారు. పోలింగ్‌కు ముందు నిధులు ఇవ్వాల్సిందే అంటూ హడావుడి చేసి ముగిసిన తర్వాత ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

ఆసరాకు అరకొరగానే నిధుల విడుదల

2019 ఏప్రిల్ వరకూ మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్ ఆసరా పేరుతో విడతల వారీ మాఫీ విధానాన్ని అమలు చేశారు. ఇందుకు సంబంధించి నాలుగో విడత నిధులను జనవరి 23వ తేదీన విడుదల చేశారు. కాకినాడ జిల్లాలోని 37,525 గ్రూపుల్లోని 3,76,071మంది మహిళల ఖాతాలకు రూ300.74కోట్లు జమకావాల్సి ఉంది. ఎన్నికల ముందు వరకూ 50శాతం మహిళల ఖాతాలకు సొమ్ములు పడలేదు. మరో నాలుగైదు రోజుల్లో అందరి ఖాతాలకు సొమ్ములు జమవుతాయని చెబుతున్నా మహిళలకు నమ్మకం కలగడం లేదు.

వడ్డీ రాయితీ ఎగ్గొట్టారు

రైతులు తీసుకున్న లక్ష లోపు వ్యవసాయ(పంట) రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే దానిపై అయ్యే వడ్డీని ప్రభుత్వమే భరించి రైతులకు తిరిగి చెల్లిస్తుంది. సున్నా వడ్డీ రాయితీ కింద నిధులు విడుదల కోసమంటూ సీఎం జగన్ ఫిబ్రవరి 28న బటన్ నొక్కారు. జిల్లాలో 34,270మంది రైతులకు రూ.5.35కోట్లు విడుదల కావాల్సి ఉంది. ప్రతిఏటా అక్టోబరులో వడ్డీ రాయితీ నిధులు విడుదల కావాల్సి ఉండగా, బటన్ నొక్కడం ఐదు నెలలు ఆలస్యం కాగా, ఇప్పుడు మరో రెండున్నర నెలల గడిచినా నిధులు రైతుల ఖాతాలకు జమకాలేదు.

రెండు సీజన్లు ముగిసినా

ఏ సీజన్‌లో జరిగిన పంటనష్టానికి పరిహారాన్ని అదే సీజన్ ముగిసేలోగా అందిస్తామని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. మిచౌంగ్ తుఫాన్‌తో జరిగిన నష్టానికి పరిహారం రెండు సీజన్లు ముగిసినా నేటి వరకూ అందలేదు. తుఫాన్ కారణంగా జిల్లాలో 13,540 హెక్టార్లల్లో పంటనష్టానికిగాను 29,370 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.23.05కోట్లు అందాల్సి ఉంది. మార్చి 6న సీఎం జగన్ బటన్ నొక్కినా నేటికీ సొమ్ములు ఖాతాలకు జమకాలేదు.

విద్యాదీవెన సొమ్ములు పడక విద్యార్థుల కష్టాలు

డిగ్రీ, వృత్తి విద్యాకోర్సులు, ఇతర ఉన్నత చదువులు అభ్యసిస్తున్న విద్యార్థుల ఫీజులను ప్రభుత్వమే భరిస్తుందంటూ జగనన్న విద్యాదీవెన పథకం కింద విడతల వారీగా నిధులు విడుదల చేస్తూ వచ్చారు. అక్టోబరులో మొదటి విడత నిధులు విడుదల చేయాల్సి ఉండగా ఐదు నెలలు ఆలస్యంగా మార్చి 1న సీఎం జగన్ బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో 41,474మంది విద్యార్థులకు సంబంధించి 37,196మంది తల్లుల ఖాతాలకు రూ28.84కోట్లు జమకావాల్సి ఉండగా పోలింగ్ వరకూ ఒక్క పైసా జమ చేయలేదు. ప్రస్తుతం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా నిధులు మాత్రం ఖాతాలకు చేరలేదు.

అందని చేయూత

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన 45-60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా ఏటా రూ.18,500 అందిస్తున్నారు. నాలుగో విడత నిధులను నాలుగు నెలలు ముందుగా మార్చి 7న జగన్ బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కాకినాడ జిల్లాలో 1,01,759మంది మహిళలకు రూ.190.90కోట్లు అందాల్సి ఉంది. ఎన్నికల లబ్ధికోసం నిధుల విడుదలను ముందు చేసినా నేటి వరకూ మాత్రం ఖాతాల్లో సొమ్ములు పడలేదు.

ఈబీసీ నేస్తం అంతే మరీ..

ఈబీసీ నేస్తం ద్వారా 45-60ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అగ్రవర్ణాల పేదలకు రూ.15వేలు అందించే కార్యక్రమానికి మార్చి 14న సీఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ములు జమచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 9,516మంది మహిళలకు రూ.14.27కోట్లు అందాల్సి ఉంది. ఈ నిధులు ఇప్పటి వరకూ విడుదల కాలేదు.

ఎంత మోసం

సంక్షేమ పథకాలకు సొమ్ములను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేస్తున్నామని సీఎం జగన్ బటన్ నొక్కే సమయాల్లో తెలిపారు. ఈ పథకాల నిధుల విడుదలకు సంబంధించి ఆర్థికశాఖ నుంచి పరిపాలనా ఆమోదాలు లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఆసరా పథకానికి మాత్రమే ఎన్నికల ముందు నిధుల విడుదలకు ఆమోదం లభించింది. అది 50శాతంలోపు నిధులకు మాత్రమే. ఇప్పుడు పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా పథకాలకు నిధులు విడుదల చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేస్తుండడంతో విషయం వెలుగుచూసింది. బటన్ నొక్కి నిధులు విడుదల చేశామంటూ సీఎం జగన్ పలికిన పలుకులన్నీ అసత్యాలని తేలడంతో ఎంత మోసంఅంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు సన్నాహాలు

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 1400మంది ఉద్యోగులతో లెక్కింపు
- ఏకకాలంలో పార్లమెంట్‌తోపాటు అసెంబ్లీ కౌంటింగ్
- జేఎన్‌టీయూకేలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మే 18: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపునకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో స్ట్రాంగ్‌రూమ్‌ల బయట ఉన్న వరండాల్లో లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు సిద్ధం చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను అనుసరించి 15 నుంచి 18 రౌండ్‌ల్లో ఫలితాలను వెలువరించనున్నారు. జూన్ 4న ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది. కౌంటింగ్ సిబ్బంది ఆరోజు ఉదయం 7 గంటలకే జేఎన్‌టీయూకేకు చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో మొత్తం 1640 పోలింగ్ కేంద్రాలనుంచి తరలించిన ఈవీఎంలను ఇక్కడ లెక్కించనున్నారు.

ఒక్కొక్క నియోజకవర్గానికి 200 మంది..

జిల్లాలో 7అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పోలింగ్ జరిగింది. ఒక్కొక్క నియోజకవర్గానికి 200మంది ఉద్యోగులను ఓట్ల లెక్కింపు నిమిత్తం కలెక్టర్ కేటాయించారు. ఈ లెక్కన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 1400మంది ప్రభుత్వ ఉద్యోగులను నియమించారు. వీరు ఏకకాలంలో అసెంబ్లీతోపాటు పార్లమెంట్ ఓట్లను ఈవీఎంల ద్వారా లెక్కిస్తారు.

ఏఏ నియోజకవర్గాలు ఎక్కడెక్కడ లెక్కింపు

తుని, కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు క్రతువు జేఎన్‌టీయూకేలో సివిల్ ఇంజనీరింగ్ పీజీ బ్లాక్‌లో వరండాలో జరుగుతుంది. ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఉన్న హాలులో లెక్కిస్తారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మెకానికల్ ఇంజనీరింగ్ పీజీ బ్లాక్ హాలులో నిర్వహిస్తారు. పెద్దాపురం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జేఎన్‌టీయూ మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం మొదటి అంతస్తులో జరుగుతుంది. ఎన్నికల నియామావళి ప్రకారం ప్రతి రౌండ్‌లో ఫలితాల ను ఎన్నికల అబ్జర్వర్లు సంతకం పెట్టిన తర్వాత మాత్రమే ఫలితాలను వెల్లడిస్తారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు ప్రత్యేకంగా ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తారు. తుది రౌండ్ పూర్తయిన తర్వాత ఆర్వోలు ఫలితాలను ప్రకటిస్తారు.

పార్కింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు

ఉద్యోగులతోపాటు, మీడియా, రాజకీయ నాయకుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు వీలుగా జేఎన్‌టీయూకేలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ద్విచక్ర వాహనాలకు, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

ఒక్కో టేబుల్ వద్ద ఇలా...

ఓట్ల కౌంటింగ్ ఒక్కో టేబుల్ వద్ద సూక్ష్మ పరిశీలకులు, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారు. స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలను తీసుకురావడానికి సిబ్బంది ఉంటారు. ఒక్కో టేబుల్ వద్ద ఆయా రాజకీయపార్టీలకు చెందిన ఏజెంట్ ఉంటారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

జేఎన్‌టీయూకే కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ఉండడానికి వీలుగా కేంద్ర బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జూన్ 4న పెద్దఎత్తున కేంద్రాల వద్దకు బలగాలను తరలిస్తున్నారు.

లెక్కింపు సీసీ కెమెరాల్లో రికార్డు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ అంతా సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పైగా వీడియో ద్వారా కూడా రికార్డు చేయిస్తున్నారు. తీసిన ఫుటేజ్‌ను భద్రపర్చి ఎన్నికల కమిషన్‌కు పంపిస్తారు.

సత్రం భూములకు.. తూట్లు



- శ్రీపానుగంటి లక్ష్మీవెంకయ్యమ్మవారి ధర్మసత్రానికి 781 ఎకరాలపైగా భూములు
- తప్పుడు రికార్డులు సృష్టించి కొన్ని భూముల అమ్మకాలు?
- చోద్యం చూస్తున్న దేవదాయ, ధర్మదాయశాఖ
- కోర్టు గొడవలు, ఆక్రమణలు పోను.. ప్రస్తుతం 658.14 ఎకరాలే సత్రం స్వాధీనంలో..
- భూశిస్తు ఆదాయం తెలపని అధికారులు
- అధికారులు, స్థానిక నాయకులు కుమ్మక్కు
- వేలంలో తక్కువ ధరలకు భూములు దక్కించుకుంటున్న దళారులు

జగ్గంపేట, మే 18: పేదల కడుపునిపేందుకు వందలాది ఎకరాలు ధారాదత్తం చేసి ఏర్పాటు చేసిన సత్రం కాస్తా ఇప్పుడు మూలనపడింది. 113 ఎకరాలకు పైగా కోర్టు కేసులో ఉంటే 9.21ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. ప్రస్తుతం సత్రం అధీనంలో 658.14 ఎకరాలు ఉన్నా కానీ సత్రం నిర్వహణకు రూపాయి ఆదాయంలేదు. ఇన్‌చార్జి ఈవోలతో కొత్తకొత్త వారు వస్తుండడంతో ఆదాయ లెక్కలను బహిర్గతం చేయడంలేదు. దీంతో సత్రం భూముల విషయమై సరికొత్త అనుమానాలు ఏర్పడుతున్నాయి.

ఉన్నత ఆశయంతో..

బాటసారులకు అన్నదానం చేయాలనే తపనతో జగ్గంపేట మండలంలో కాట్రావులపల్లిలో శ్రీపానుగంటి లక్ష్మీవెంకయ్యమ్మవారి ధర్మసత్రం 1886లో స్థాపించారు. ఈసత్రం ద్వారా బాటసారులకు నిరంతరం అన్నదానం చేసేవారు. అన్నదానానికి ఆటంకం కలగకుండా పల్లం, మెరక భూములు 781.53 ఎకరాలు ఈ సత్రానికి రాసిచ్చారు. ఆ భూముల ద్వారా వచ్చే శిస్తుతో నిత్యం అన్నదానం జరిగేది. కాలానుగుణంగా ఈ సత్రం దేవదాయ ధర్మదాయశాఖ అధీనంలోకి వెళ్లింది. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురం మండలాల్లో ఈ భూమి విస్తరించి ఉంది. రామవరంలో పల్లం 8.88, మెరక 104.49 ఎకరాల కలిపి మొత్తంగా 113.37 ఎకరాల భూమి కోర్టు గొడవల్లో ఉండిపోగా కొన్ని గ్రామాల్లో 9.21 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. 0.81ఎకరాల భూమి వ్యవసాయ యోగ్యంకానిదిగా మిగిలిపోయింది. ప్రస్తుతం పల్లం భూమి 200.84, మెరక 457.30ఎకరాలు కలిపి మొత్తంగా 658.14ఎకరాలు భూమిసత్రం స్వాధీనంలోఉంది. ఈసత్రం పేరుమీద జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో రెండు ఊర్లు ఉన్నాయి.

దళారుల కారణంగా..

గండేపల్లి మండలం సుబ్బయమ్మపేటలో అత్యధికంగా 155.06 మెరక భూములకు 204 మంది శిస్తు కట్టి సాగు చేసుకుంటున్నారు. ఒక్కో ఎకరానికి రూ.10వేలు శిస్తు రూపేణ కట్టిన కోట్లాది రూపాయిలు ఆదాయం రావాల్సి ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల ప్రకారం రైతులు మెరక ప్రాంత భూములకు రూ.20వేలనుంచి రూ.25వేల వరకు శిస్తు చెల్లించి వ్యవసాయం సాగు చేసుకుంటున్నారు. దాని లెక్కన చూసినా సత్రం భూములకు రూ.10వేలు చెల్లిస్తే కోట్ల రూపాయిల ఆదాయంతో విరాజిల్లేది. కొంతమంది దళారులు సత్రం భూములను రెండేళ్లకోసారి వేలంలో అతి తక్కువ ధరకు దక్కించుకుని రైతులకు అధిక ధరకు సాగుకు ఇస్తున్నారు. దళారుల స్వలాభంవల్ల సత్రం ఆదాయం తగ్గిపోతోంది. భూ దళారులు దేవదాయ,ధర్మదాయశాఖ అధికారులతో చేతులు కలిపి సత్రం ఆదాయానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రతిఏటా వేలంపాట నిర్వహించకముందు ఆస్తులు వివరాలు తెలియజేయాల్సిన అవసరమున్నా అధికారులు ఆదాయ వివరాలేవీ బయట పెట్టకపోవడం ఆశ్చర్యకరంగా కనిపిస్తోంది. సత్రానికంటూ ప్రత్యేక ఈవో లేకుండా ఇన్‌చార్జి ఈవోలతో కాలం గడుపుతుండడంతో లెక్కలు తారుమారయ్యే పరిస్థితి నెలకొని ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. కనీసం ఈ సత్రం లెక్కలు చెప్పే నాధుడే కరువయ్యాడు. కోట్లాది రూపాయిలు ఆస్తి ఉన్నా సత్రాన్ని రక్షించేవారు లేకపోవడం విడ్డూరంగా ఉంది. అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వముంటే ఆ నాయకుల అండదండలతో అధికారులు ఇష్టమొచ్చిన వారికి భూములు వేలంపాటలో తక్కువ ధరకు పాడుతున్నారు. ప్రజలకోసం ఏర్పాటు చేసిన ఈ సత్రం మరికొన్నేళ్లపాటు మనుగడ కొనసాగించాలంటే దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ ఏడాదైనా సత్రానికి ఆదాయం తెచ్చి ఆదాయ వ్యయాలతోపాటు నిల్వలను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలి. ఈ భూములను కొందరు దళారులు తప్పుడు రికార్డులు తయారు చేసి ఇప్పటికే అమ్మకాలు చేశారనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలుకోరుతున్నారు.

శ్రీపానుగంటి లక్ష్మీవెంకయ్యమ్మ వారి ధర్మసత్రం భూముల వివరాలు

గ్రామం	పల్లం(ఎ.సెం)	మెరక(ఎ.సెం)	మొత్తం	రైతులు
కాట్రావులపల్లి	11.75	--	11.75	4
సీతానగరం	27.40	--	27.40	2
రాజపూడి	--	1.33	1.33	1
మన్యంవారిపాలెం	--	1.34	1.34	1
వెంగయ్యమ్మపురం	--	96.92	96.92	194
మల్లిసాల	--	17.85	17.85	41
మల్లిసాల	--	38.50	38.50	9
రామవరం	74.28	67.44	141.72	25
రామవరం	8.88	104.49	113.37	--
రామవరం	--	9.21	9.21	--
యర్రంపాలెం	--	3.56	3.56	1
ఉప్పలపాడు	59.20	45.04	104.24	7
సుబ్బయ్యమ్మపేట	--	155.06	155.06	204
తాళ్ళూరు	--	27.48	27.48	8
మల్లేపల్లి	--	0.32	0.32	--
బొర్రంపాలెం	--	0.49	0.49	--
బూరుగుపూడి	3.59	--	3.59	2
సోమవరం	12.82	2.78	15.60	3
పులిమేరు	4.36	--	4.36	1
జల్లూరు	7.44	--	7.44	3
మొత్తం	**209.72**	**571.81**	**781.53**	**506**

సత్యదేవుడు పెండ్లికొడుకాయనే..

- ఘనంగా ప్రారంభమైన సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు
- నేడు రాత్రికి అంగరంగవైభవంగా స్వామివారి దివ్యకల్యాణం
- వెండి ఆంజనేయ వాహనంపై క్షేత్రపాలకుల గ్రామోత్సవం



ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్షకు 1060మంది విద్యార్థుల హాజరు

- మొత్తం 95.24శాతం హాజరు నమోదు

7లో

ప్రాణాలు తీసిన ఈత సరదా

- రావులపాలెం వద్ద గోదావరిలో ముగ్గురి గల్లంతు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం

7లో

జీజీహెచ్‌లో ట్రైనీ కలెక్టర్ తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

జీజీహెచ్(కాకినాడ), మే 18: కాకినాడ జీజీహెచ్‌లోని పలు విభాగాల్లో ట్రైనీ కలెక్టర్ భావన శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆమె జీజీహెచ్‌లోని ఓపీ విభాగం, అత్యవసర విభాగం, సూపర్ స్పెషాలిటీ విభాగంలోని ఐసీయూలు, ట్రామా కేర్ సెంటర్, స్కిల్ ల్యాబ్, ఎంఆర్‌ఐ విభాగం తదితర వార్డులను వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆస్పత్రి ప్రాంగణంలోని వార్డులు, ఐసీయూలు, తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో రోగులు, క్షతగాత్రుల సహాయకులు వేచి ఉండేందుకుగాను కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ సూపరింటెండెంట్ ఛాంబర్‌కు చేరుకుని ఆస్పత్రిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారితో చర్చించారు. ట్రైనీ కలెక్టర్ వెంట డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, ఆర్ఎంవో డాక్టర్ యమున, హెచ్‌ఐ సువర్ణరాజు ఉన్నారు.

సత్యదేవుడు పెండ్లికొడుకాయనే

ఘనంగా ప్రారంభమైన సత్యదేవుడి కల్యాణోత్సవాలు

నేడు దివ్యకల్యాణం

అన్నవరం, మే 18: సత్యదేవుడు పెండ్లికొడుకైన వేళ ప్రకృతి పులకించింది. రత్నగిరి శోభిల్లింది. సత్యదేవుడి సాప్తాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా తొలిరోజైన శనివారం సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి అమ్మవార్లను పెండ్లికొడుకు, పెండ్లికుమార్తెలుగా చేసే కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. పిలిస్తే పలికే దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి క్రోధి నామ సంవత్సర దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం సాయంత్రం 4.30కి అనివేటి మండపంలో విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. ముందుగా వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై నవ వధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మరో వేదికపై పెండ్లిపెద్దలైన సీతారాములను ఆశీనులు గావించి ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల అనంతరం ఉల్లూకల గౌరీపూజను నిర్వహించారు. చతుర్వేద పండితులు మహదాశీర్వచనం అందించిన పిమ్మట ముత్తైదువులు పసుపు దంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లకు దివ్యాభరణాలు ధరింపచేసి నుదుట తిలకం, బుగ్గనచుక్కతో అలంకరించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు పాల్గొనగా వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించారు.





పసుపు దంచుతున్న ముత్తైదువులు

హాస్యోక్తులతో ఎదుర్కోలు ఉత్సవం

సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా మొదటిరోజైన శనివారం రాజరామరాయ కళామందిరంలో నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం ఆద్యంతం హాస్యోక్తులతో సాగింది. స్వామివారి తరుపున చైర్మన్ ఐ.వి రోహిత్ కొందరు పండితులు అమ్మవారి తరపున ఈవో రామచంద్రమోహన్ మరి కొందరు పండితులు రెండు బృందాలుగా విడిపోయి స్వామిఅమ్మవార్ల కీర్తిప్రతిష్టలు, గుణగణాలు, వంశ కీర్తి చలోక్తులతో కీర్తిస్తూ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లగ్నపత్రికలు ఒకరినొకరు మార్చుకుంటూ కల్యాణ శుభఘడియలు పండితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



ఉల్లూకల గౌరీపూజను నిర్వహిస్తున్న పండితులు

వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములు

స్వామివారి దివ్య కల్యాణోత్సవ గ్రామోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన గ్రామోత్సవంలో వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములను ఊరేగించారు. ఆదివారం జరిగే స్వామివారి కల్యాణానికి గ్రామస్థులకు సీతారాములు ఆహ్వానించేందుకు ప్రతీకగా దీనిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సత్యదేవుడి వార్షిక దివ్యకల్యాణం ఆదివారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు 40 అడుగుల వెడల్పుతో వివిధ పుష్పమాలికలు, విద్యుద్దీప అలంకరణలతో కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దారు. సుమారు 25 వేల మంది విచ్చేస్తారని అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కల్యాణవేడుక తిలకించేందుకు విచ్చేస్తారని అధికారులు తెలిపారు.



వెండి ఆంజనేయ వాహనంపై సీతారాములు

పెదశేషవాహనంపై భావనారాయణస్వామి



పెదశేషవాహనంపై స్వామి,అమ్మవారు

సర్పవరం జంక్షన్, మే 18 : కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు భక్తుల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి సుప్రభాత సేవ, ప్రత్యేక అర్చనలు, హోమం, పలు రకాల విశేష ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివాహ మహోత్సవంలో భాగంగా స్వామివారిని మాడ వీధుల్లో పెద శేషవాహనంపై ఊరేగించారు. ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సాయంత్రం కట్టా నూకరాజు బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేగుళ్ల, లీలాకృష్ణపై అట్రాసిటీ కేసు

కపిలేశ్వరపురం, మే 18: పోలింగ్ సందర్భంగా ఈనెల 13న వల్లూరులో జరిగిన ఘర్షణ నేపథ్యంలో కేసులు నమోదవుతున్నాయి. తమను కులం పేరుతో దూషించారని గ్రామానికి చెందిన పలివెల రోకేష్, నక్కా భాస్కరరావు, నక్కా అమ్మిరాజులు విడివిడిగా ఫిర్యాదులు అందజేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, స్థానిక టీడీపీ నాయకుడు వేగుళ్ల వీరబాబులపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

నో మేన్ జోన్‌గా 'నన్నయ'

దివాన్‌చెరువు, మే 18: జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరచిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని నో మేన్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. దీంతో విశ్వవిద్యాలయంలోని రోజువారీ కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకూ వర్సిటీ అధికారులు నిలుపుదల చేశారు. జిల్లాలోని రాజమహేంద్రవరం పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచగా భద్రతా బలగాలు 24 గంటలూ కాపలా కాస్తున్నాయి. అలాగే వర్సిటీ పరిధిలో 144 సెక్షన్ విధించారు. ఈ నేపథ్యంలో విశ్వ విద్యాలయాన్ని నో మ్యాన్ జోన్‌గా ప్రకటించారు. దీంతో శనివారం ఉదయం విధులకు హాజరైన బోధన, బోధనేతర సిబ్బంది గుర్తింపు కార్డులను వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద విశ్వవిద్యాలయ అధికారుల పర్యవేక్షణలో పోలీస్‌లు పరిశీలించి వారి వివరాలను ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేసుకున్న అనంతరం విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వరకూ అనుమతించారు. అనంతరం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయంలోని రోజువారీ కార్యక్రమాలు 6వ తేదీ వరకూ నిలుపుదల చేశామని, సిబ్బందిని ఇంటి నుంచే పనిచేయాలని సూచించారు. అత్యవసర సమయంలో 15 మంది అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు అనుమతించాలని జిల్లా అధికారులను కోరుతూ యూనివర్సిటీ అధికారులు లేఖ రాసినట్టు తెలిసింది.

జూన్ 6 వరకూ కార్యకలాపాలు నిలుపుదల: వీసీ

ఎన్నికల కారణంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు నన్నయ యూనివర్సిటీలోని రోజువారీ కార్యక్రమాలను జూన్ 6వ తేదీ వరకూ నిలుపుదల చేశామని వీసీ కె.పద్మరాజు శనివారం తెలిపారు. ఈవీఎంలు, ఇతర ఎన్నికల పత్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కోసం కౌంటర్లు ఉన్న కారణంగా క్యాంపస్‌ను నో మ్యాన్ జోన్‌గా ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ప్రకటించారన్నారు.

కిటకిటలాడిన 'వాడపల్లి'



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆత్రేయపురం, మే 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, చిర్ల జగ్గిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.42.14 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా



సంఘటన స్థలం వద్ద గుమిగూడిన స్థానికులు, బంధువులు

గోదావరిలో ముగ్గురు గల్లంతు

ఇద్దరి మృతదేహాలు లభ్యం

మరొకరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు



జయకుమార్ మృతదేహం



ఈశ్వరరెడ్డి మృతదేహం



సబ్బెళ్ల ఈశ్వరరెడ్డి



జయకుమార్



గోదావరిలో గల్లంతైన సంపతరెడ్డి

రావులపాలెం, మే 18: వాళ్లు ఐదుగురు స్నేహితులు.. సెలవులు కావడంతో సరదాగా బయటకు వెళదామనుకుని గోదావరి ఒడ్డుకు వచ్చారు. సరదాగా ఈత కొడదామనుకుని వారిలో నలుగురు గోదావరిలో దిగారు. అయితే దురదృష్టవశాత్తూ ముగ్గురు మునిగిపోయి గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యంకాగా, మరొకరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ విషాదకర సంఘటన శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి పాతబ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం చినవంతెన వద్ద ఉంటున్న సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డి(20), అతని సోదరుడు సత్యనారాయణరెడ్డి, పిన్ని కొడుకు సత్తి సంపతరెడ్డి(16), అక్కడే నివాసం ఉంటున్న పెంటా జయకుమార్(19), కొమ్మర్తి రాజేష్ ఈ ఐదుగురు స్నేహితులు. కాగా సంపతరెడ్డి విజయనగరం నుంచి వేసవి సెలవులకు రావులపాలెం పిన్ని ఇంటికి వచ్చాడు. ఐదుగురు స్నేహితులు కలిసి మధ్యాహ్న సమయంలో గోదావరి స్నానం చేద్దామని గౌతమి గోదావరి పాతబ్రిడ్జి వద్దకు వెళ్లి అక్కడ నుండి ఇసుక మేటలో కిలోమీటరు మేర నడిచి నీటి ప్రవాహం వద్దకు చేరుకున్నారు. వీరిలో పెద్దవాడైన సత్యనారాయణరెడ్డికి ఈత రాకపోవడంతో గట్టున కూర్చుని ఉన్నాడు. మిగిలిన నలుగురు గోదావరిలో స్నానానికి దిగారు. కొంతసేపటికే అందరూ మునిగిపోయారు. వారిలో కొమ్మర్తి రాజేష్ కంగారుగా బయటకు వస్తుండటంతో అక్కడే ఉన్న సత్యనారాయణరెడ్డి ముగ్గురు గల్లంతయినట్లు గుర్తించి కేకలు వేశాడు. ఆ సమీపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వచ్చి గల్లంతైన వారి కోసం వెతికిన ప్రయోజనం లేకపోయింది. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఎం.ఆంజనేయులు, రెవెన్యూ, కొత్తపేట ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సబెళ్ళ ఈశ్వరరెడ్డి, పెంటా జయకుమార్, మృతదేహాలు లభ్యం కాగా గల్లంతైన సంపతరెడ్డి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆంజనేయులు, తహసీల్దారు అశోక్‌వర్మ తెలిపారు.

గుండెలవిసేలా రోదిస్తున్న సోదరుడు

ఐదుగురులోని ముగ్గురు అన్నదమ్ములు కాగా మరో ఇద్దరు స్నేహితులు. సబ్బెళ్ళ సత్యనారాయణరెడ్డి మృతిచెందిన సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డిలు సొంత అన్నదమ్ములు కాగా వాళ్ళ పిన్ని కొడుకు సత్తి సంపతరెడ్డి వేసవి సెలవులు అని పెద్దమ్మ ఇంటికి రావులపాలెం వచ్చాడు. గోదావరి స్నానానికి వెళ్లిన సమయంలో తమ్ముళ్లు ఇద్దరు నదిలో గల్లంతు కావడంతో సత్యనారాయణరెడ్డి గుండెలవిసేలా రోదించాడు. ఈశ్వరరెడ్డి మృతదేహం లభ్యం కాగా సంపతరెడ్డి మృతదేహం కోసం గాలిస్తున్నారు. సత్యనారాయణరెడ్డి తండ్రి సూర్యనారాయణరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కంద అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబం తీవ్రవిషాదంలో మునిగిపోయింది. వేసవి సెలవులకు వచ్చిన సంపతరెడ్డి గల్లంతవ్వడంతో విజయనగరంలో నివాసం ఉంటున్న తండ్రి దుర్గారెడ్డికి బంధువులు సమాచారం అందించారు. అక్కాచెల్లెళ్ల బిడ్డలు ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా ఒకరు గల్లంతు కావడంతో ఆ కుటుంబాలు రోదిస్తున్న తీరు స్థానికులను సైతం కంటతడిపెట్టించింది.

చేతికి వచ్చిన కొడుకు మృతిపై తండ్రి ఆవేదన..

రావులపాలెం చినవంతెన వద్ద నివాసం ఉంటున్న జయకుమార్ తండ్రి వడ్రంగి పనిచేస్తూ కొడుకును చదివిస్తున్నాడు. జయకుమార్ స్థానిక డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ ఖాళీ సమయంలో ఫొటో స్టూడియోలో పనిచేస్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవ్వరివల్ల కాలేదు. కాగా సబ్బెళ్ళ ఈశ్వరరెడ్డి ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సంపతరెడ్డి 10వ తరగతి చదువుతున్నాడు.

గోదావరిలో వరుస ఘటనలతో ఆందోళన...

గోదావరిలో వరుస ఘటనలు జరగడంతో నదీ పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆలమూరు మండలం మడికికి చెందిన ముగ్గురు మహిళలు వాడపల్లి వెంకన్న దర్శనానికి వెళ్తూ బడుగువారిలంక వాని వద్ద ముగ్గురు మృతిచెందిన సంఘటన మరువక ముందే ఐదు కిలోమీటర్ల దూరంలో వారం తిరగకుండా రావులపాలెం గౌతమి పాతబ్రిడ్జి వద్ద గోదావరిలో ఇద్దరు గోదావరిలో ఈతకు వెళ్లి మృతిచెందడం, మరొకరు గల్లంతు కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాలువలకు నీటిసరఫరా నిలుపుదల చేయడం వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నీటి ప్రవాహం అధికంగా ఉండటమే ఈ ప్రమాదాలకు కారణమని స్థానికులు భావిస్తున్నారు. గోదావరి చెంతకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిట్ విచారణ పారదర్శకంగా జరగాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 18 : రాష్ట్రంలో ఎన్నికల అనంతరం చెలరేగిన హింస నేపథ్యంలో ఏర్పాటైన సిట్ విచారణ అత్యంత పారదర్శకంగా జరగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. భారత దేశ ఎన్నికల చరిత్రలో రాష్ట్రంలో ఇలాంటి హింస ఎన్నడూ జరగలేదన్నారు. అత్యున్నత పోలీస్ అధికారులు పలువురు సస్పెండ్ కావడం, కలెక్టర్లు, ఇతర ఐపీఎస్ అధికారులు బదిలీ కావడం ఎన్నడూ లేదన్నారు. అధికార పార్టీకి కొందరు ఐపీఎస్‌లు తొత్తులుగా మారడం వల్లే ఇదంతా జరిగిందని, పోలీస్ అధికార వ్యవస్థ దీన్ని చూసి సిగ్గుపడాలన్నారు. గోదావరి నడిబొడ్డున అక్రమంగా ఎంత ఇసుక తవ్వుతున్నారో అందరికీ తెలుసని, ఇసుక అక్రమాలు, అక్రమ సంపాదనపై కొత్త ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి పార్టీ ఓటమి ఖాయమని, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ఓడిపోతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, ఎన్టీ రామారావు దేశంలో లౌకిక వ్యవస్థను గట్టిగా విశ్వసించారని, ఇప్పుడున్న నాయకులు కూడా లౌకిక రాజ్యాంగంపై పోరాడాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఈఏపీ సెట్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



ఎస్.రాధాకృష్ణ



సాకేత్‌రాఘవ్

రాజమహేంద్రవరం రూరల్, మే 18: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీ సెట్ పరీక్షల్లో రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తమ విద్యార్థి ఎస్.రాధాకృష్ణ స్టేట్ 2వ ర్యాంక్, ఎస్.సాకేత్ రాఘవ్ స్టేట్ 4వ ర్యాంక్, పి.శివసంపత్ నాయుడు స్టేట్ 25వ ర్యాంక్, వీఎస్‌జీఎస్‌వీ రామకృష్ణారెడ్డి స్టేట్ 53వ ర్యాంక్, వి.అభిశ్యామ్ స్టేట్ 64వ ర్యాంక్, డి.ప్రభాస్ స్టేట్ 91వ ర్యాంక్ సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఈఏపీ సెట్‌కు 1060 మంది హాజరు

మొత్తం 95.24 శాతం నమోదు

జేఎన్టీయూకే, మే 18: కాకినాడ జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి శనివారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 1113 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1060 మంది హాజరయ్యారని, 53 మంది గైర్హాజరు కాగా 95.24 శాతం హాజరు నమోదైందని కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు 950 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 918 మంది హాజరయ్యారని, 32 మంది పరీక్ష రాయలేదని మొత్తం 96.63 శాతం హాజరు నమోదైందని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 345 మంది హాజరు కావాల్సి ఉండగా 341 మంది హాజరయ్యారని నలుగురు గైర్హాజరు కాగా మొత్తం 98.84 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు శనివారం ఉదయం సెషన్ మాత్రమే జరిగాయని ఈనెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

నాయకులకు తప్పనిసరిగా విజన్ ఉండాలి

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

రాజానగరం, మే 18 : ఉపాధ్యాయ వృత్తిలో నాయకులుగా రాణించాలంటే విజన్ ప్రధాన ఉండాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం సమీపంలోని గైట్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రోపాధ్యాయ (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహారెడ్డి నాయకత్వ లక్షణాలపై ప్రసంగించారు. నాయకులు సర్వనైపుణ్యాల సమ్మేళనమైతే బాగా రాణిస్తారన్నారు. నాయకుడిగా ఎదిగిన ఉపాధ్యాయుల్లో దేశాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసినవారు ఎందరో ఉన్నారన్నారు. నాయకుడు నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. అటువంటి ఉపాధ్యాయులే ఉత్తమ లీడర్లుగా ఎదుగుతారని చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యారంగ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పలు సంస్కరణలు తీసుకొచ్చేందుకు యోచిస్తున్నామన్నారు. అనంతరం పెన్షన్ నిబంధనలపై ఎం.రఘునాథరెడ్డి, ఏఐఎస్‌టీఎఫ్ పాత్ర ఉద్యమాల నిర్వహణ అంశంపై ఏఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ప్రాతినిధ్యాలు, రాయబారాలు, ఆర్థిక వ్యవహారాలపై ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు రాజుల నాగేశ్వరరావు ప్రసంగించారు. శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిసినందున ఎస్టీయూ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీవిశ్వనాథ్, రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, మహిళా నాయకులు శైలజా భవాని, సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌జే త్రినాథ్‌బాబు, బి.ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, శామ్యూల్‌సన్, వైవీ సత్యనారాయణ, సత్తిరాజు పాల్గొన్నారు.

శనేశ్వర ఆలయం కిటకిట



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట, మే 18: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,43,585 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

కాకినాడ

'ఐటీఐతో మెరుగైన ఉద్యోగావకాశాలు'

కార్పొరేషన్(కాకినాడ), మే 18: టెన్త్ పాసైన విద్యార్థులు ఐటీఐ చదవడం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి, కమిటీ కన్వీనర్ తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో ఒకేషనల్ గైడెన్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి, కమిటీ కన్వీనర్ మాట్లాడుతూ ఐటీఐ అడ్మిషన్ల కోసం జూన్ 10వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

మున్సిపల్ అధికారుల మధ్య కోల్డ్‌వార్!

పిఠాపురంలో డీఈఈని ప్రభుత్వానికి సరెండర్ చేసిన కమిషనర్

కమిషనర్ ఉత్తర్వులు సస్పెండ్ చేసిన హైకోర్టు

విధుల్లో చేరిన డీఈఈ

డీఈఈ చాంబర్‌కు తాళాలు

వాటర్‌వర్క్స్ నుంచి విధులు



డీఈఈ చాంబర్‌కు తాళాలు వేసిన దృశ్యం



వాటర్‌వర్క్స్ నుంచి విధులు నిర్వర్తిస్తున్న భవానీశంకర్

పిఠాపురం, మే 18: పిఠాపురం పురపాలక సంఘంలో అధికారుల మధ్య కోల్డ్‌వార్ ముదిరి రోడ్డున పడింది. వైసీపీ నేతల ఒత్తిడితో మున్సిపల్ డీఈఈని కమిషనర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. హైకోర్టు సదరు ఉత్తర్వులను సస్పెండ్ చేయడంతో విధుల్లో చేర్చుకున్నా, డీఈఈ చాంబర్‌కు తాళాలు వేయించారు. దీంతో ఆయన వాటర్‌వర్క్స్ కార్యాలయం నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విధంగా చేయడానికి వెనుక వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఒత్తిడి ఉన్నట్లు చెబుతున్నారు.

పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలో డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న భవానీశంకర్ ఫిబ్రవరి 28 నుంచి మార్చి 13వరకూ సెలవు పెట్టారు. అంతకు ముందే ఎన్నికల విధులకు ఆయనను కేటాయించారు. వాటికి హాజరు కాకుండా సెలవు పెట్టడంతో జాయింట్ కలెక్టరు కమిషనర్‌ని వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇదే సమయంలో డీఈఈ తరచూ సెలవులో ఉంటున్నారని.. విధులకు, కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడం లేదని, అభివృద్ధి పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పనులకు బిల్లులు చేయడం లేదని అతని సేవలు పురపాలక సంఘానికి అవసరం లేదంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి మార్చి 7న కమిషనర్ ఎస్.కనకారావుకు అధికారికంగా లేఖ ఇచ్చారు. దీనిపై ఈఎన్‌సీకి తగు చర్యలు నిమిత్తం నివేదించినా చర్యలు లేకపోవడంతో మార్చి 13న డీఈఈ భవానీశంకర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కమిషనర్ కనకారావు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై డీఈఈ భవానీశంకర్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాలు అనంతరం డీఈఈ ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కమిషనర్ మార్చి 13న ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ, అతను పూర్వ పరిస్థితుల మాదిరిగానే విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ హైకోర్టు మే 10న ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో ఎన్నికల అనంతరం మే 15న డీఈఈ భవానీశంకర్‌ను విధుల్లోకి తీసుకుంటూ కమిషనర్ ఆదేశాలిచ్చారు.

విధుల్లో చేరినా...

విధుల్లో చేరిన భవానీశంకర్‌కు మున్సిపల్ కార్యాలయంలో చుక్కెదురైంది. కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న డీఈఈ చాంబర్‌కు తాళాలు వేసి ఉన్నాయి. తాళాలు తెరిచేందుకు ఎవ్వరు రాలేదు. దానిపై మాత్రం ఇంజనీరింగ్ విభాగం షిఫ్టింగ్ పనులు జరుగుతున్నాయని నోటీసు అంటించారు. అక్కడ ఎటువంటి పనులు జరగకపోగా, మిగిలిన ఏఈ చాంబర్ తెరిచి ఉండగా, విభాగ సిబ్బంది అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఎన్నికల సామాగ్రి అందులో ఉండిపోయిందని మున్సిపల్ అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. హైకోర్టు ఆదేశాలతో విధుల్లో చేరిన డీఈఈ భవానీశంకర్‌కు అడ్డంకులు కల్పించే ఉద్దేశ్యంతో వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతల ఒత్తిడితో మున్సిపల్ అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాంబర్‌కు తాళాలు వేయడంతో డీఈఈ భవానీశంకర్ రాజావారికోటలోని మున్సిపల్ వాటర్ వర్క్స్‌లోని గది నుంచి తన విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా మున్సిపల్ డీఈఈ భవానీశంకర్ వ్యవహార శైలిపై గతం నుంచి పలు విమర్శలు ఉన్నాయి.

ఇబ్బందులకు గురిచేస్తున్నారు

అనారోగ్యంతో బాధపడుతున్నా మున్సిపల్ కమిషనర్ నన్ను టార్గెట్ చేసి వేధిస్తున్నారు. పురపాలకసంఘ కార్యాలయంలో నా చాంబర్‌కు తాళాలు వేయడంతో గత్యంతరం లేక వాటర్‌వర్క్స్ నుంచి విధులు నిర్వహిస్తున్నాను. జీతం ఇవ్వకుండా, ఇతరత్రా బిల్లులు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

— మున్సిపల్ డీ.ఈ.ఈ., భవానీ శంకర్

సరెండర్ చేశాం

విధులకు సరిగా రావడం లేదని, అభివృద్ధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, చేసిన పనులకు బిల్లులు చేయడం లేదని, కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడం లేదని, అతనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇచ్చిన లేఖను అనుసరించి సరెండర్ చేశాం. హైకోర్టు ఆదేశాల మేరకు తిరిగి విధుల్లోకి చేర్చుకున్నాం. ఇంజనీరింగ్ విభాగం షిఫ్టింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో, ఎన్నికల పోలింగ్ ఇక్కడ జరగడంతో కంప్యూటర్లు, ఇతర రికార్డులను డీఈఈ చాంబర్‌లో ఉంచాం. అందుకే తాళం వేసి ఉంది. విధుల్లో చేరినా డీఈఈ మున్సిపల్ కార్యాలయానికి రావడంలేదు.

— కమిషనర్, కనకారావు

21 నుంచి విద్యార్థులకు అవగాహన తరగతులు

కాకినాడ సిటీ, మే 18: పదో తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు ఈనెల 21 నుంచి జూన్ 5 వరకు యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ హోంలో శనివారం జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అత్యంత కీలకం కావడం వల్ల భవిష్యత్తులో రాణించేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులతో 15 ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కాకినాడ కచేరీపేటలోని యూటీఎఫ్ హోంలో ఈ తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9346264224, 7893211869 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, పూర్వ జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎ.సంజయ్, నగర కార్యదర్శి ఎ.వాసు, జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ సాహితీ పాల్గొన్నారు.

21న వాగ్గేయకారుడు కొచ్చర్లకోట జయంతి

పోర్టుసిటీ (కాకినాడ), మే 18: ప్రముఖ సంగీత వాగ్గేయకారుడు దివంగత కొచ్చర్లకోట రామరాజు 148వ జయంతి వేడుకలను ఈ నెల 21న నిర్వహిస్తున్నామని ఆయన మనుమడు, సుప్రీంకోర్టు న్యాయవాది కె.ప్రభాకర సుందరరావు తెలిపారు. స్థానిక సూర్యకళామందిరంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు సూర్యకళామందిరంలో ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు రామరాజు కీర్తనల సీడీని ఆవిష్కరిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వారణాసి రామ్‌మాధవ్, విశిష్ట అతిథిగా గౌహతికి చెందిన నార్త్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ టీపీఎస్ఎల్ఎన్ మూర్తి విచ్చేసి ప్రసంగిస్తారన్నారు. ప్రముఖ సంగీత విద్యాంసురాలు పెద్దాడ సూర్యకుమారి మాట్లాడుతూ తాను, కల్యాణ్ కౌశిక్, ప్రవీణ్ కుమార్ కలిసి రామరాజు కీర్తనలు పాడామన్నారు. అవి సీడీ రూపంలో రావడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. సాహిత్య అభిమానులు, సాహితీవేత్తలు, నగర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'ముద్రగడ బారసాలకు సిద్ధమవ్వాలి'

జగ్గంపేట, మే 18: ముద్రగడ పద్మనాభం జూన్ 4న బారసాలకు సిద్ధమవ్వాలని, పవన్‌కల్యాణ్ అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నారని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గం ప్రజలందరి ఆశీస్సుతో అత్యధిక మెజార్టీతో పవన్‌కల్యాణ్ గెలుస్తున్నారని కాపు ఉద్యమ నాయకుడిగా అనేక సవాళ్ళు చేసిన ముద్రగడ నాలుగోతేదీ పేరు మార్పుకు మాకిలాంటి ముఖ్యమైన నాయకులను పిలుస్తారా? ప్రజలందరినీ పిలుస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ముద్రగడను ప్రజలందరూ జిల్లా నుంచి బయటకి పంపించే తరుణం ఆసన్నమైందని, మీరు మాట మీద నిలబడి పేరు మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని శ్రీనివాస్ అన్నారు.

ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడికి సత్కారం

అన్నవరం, మే 18: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కుసుమంచి సుబ్బరాయులను శనివారం అన్నవరం వాసవీ కన్యకాపరమేశ్వరీ నిత్యాన్నసత్ర సమాజం కార్యవర్గం ఘనంగా సన్మానించింది. సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే ఆర్యవైశ్య భక్తుల సౌకర్యార్థం 80 గదులు అందుబాటులో ఉన్నాయని, నిత్యం 500 మందివరకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నట్టు సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ ఆయనకు వివరించారు. మరిన్ని సౌకర్యాల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని సుబ్బరాయులు తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు తల్లం సత్యారావు, పేరూరి బద్రీనారాయణ, పచ్చిగోళ్ల రాజబాబు, దాసరి బాబ్జి, పెనుగొండ కామరాజు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పిఠాపురం, మే 18: పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్ మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజారావుకి అధ్యక్షుడిగా ఇది ఐదో పర్యాయం. ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాదికారి, లేడీ రిప్రజెంటేటివ్ పదవులకు ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా ఎస్ఎం.ఆలీ, కార్యదర్శిగా కొంజర్ల అప్పారావు, కోశాధికారిగా గౌతు రాజు, లేడీ రిప్రెజెంటేటివ్‌గా ఎం.సత్యవతి, లైబ్రరీ సెక్రటరీగా యు.అప్పారావు, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా ఎంవీవీఎస్ సత్యనారాయణలు, కార్యవర్గ సభ్యులుగాఎస్.శివశంకర్, జి.రేగన్‌రాజు, ముమ్మిడి శ్రీనివాసరావు, కేయూ ఉమామహేశ్వరరావు,అల్లాడ గీతలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది పడాల రవి వ్యవహరించారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి అభినందన

సామర్లకోట, మే 18: కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గెలుపొందిన సామర్లకోటకు చెందిన సీనియర్ న్యాయవాది కెవీ.భద్రరావును సామర్లకోటకు చెందిన పలువురు ప్రముఖులు శనివారం అభినందించారు. సామర్లకోట భీమేశ్వరా జర్నలిస్టుల సంఘం ప్రతినిధులచే సామర్లకోట లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగిన అభినందన సభలో భద్రరావును పూలమాలలతో అభినందించారు. సభలో న్యాయవాది కె.శ్రీవాణి, పోలిమాటి విజయ్ కుమార్, ఉప్పలపాటి చంద్రయ్యదాస్, అడపా వెంకట్రావు, డీవీ.మల్లేష్, అందుగుల వీర్రాజు, మంచెం సత్తిరాజు, పెమ్మాడి వీరభద్రరావు పాల్గొన్నారు.

బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీగా శివ

గండేపల్లి, మే 18: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బిల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీగా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన కొత్త చినవీరభద్రం (శివ) ఎన్నికయ్యారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని, పదవికి పూర్తి న్యాయం చేస్తానని శివ పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

'పుస్తక పఠనంతో మరింత పరిజ్ఞానం'

ఏలేశ్వరం, మే 18: పుస్తక పఠనంతో విద్యార్థులకు మరింత పరిజ్ఞానం లభిస్తుందని ఉపాధ్యాయులు మామిడి రాంబాబు, ఏబీవీ.ప్రసాద్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం స్పోకెన్ ఇంగ్లీష్, నీతి కథలు, స్టోరీ రైటింగ్, గణితం తదితర అంశాలను నేర్పించారు. గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శిక్షణా శిబిరాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ పాలకులు కవికొండ సత్యనారాయణ తెలిపారు.

వాతావరణంలో మార్పులు

సామర్లకోట, మే 18: ఎండలు మండిపోవాల్సిన సమయంలో వాతావరణంలో మార్పులొచ్చాయి. నెలన్నర కాలంగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత వాతావరణంతో ఇబ్బంది పడ్డ జిల్లా ప్రజలు 4 రోజులుగా చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. మరో వారం రోజులు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా జిల్లాలో ఉష్ణోగ్రతలు పలు మండలాలలో తగ్గాయని అత్యల్పంగా సామర్లకోటలో 26.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు చెప్పారు.

ఉప్పాడ తీరంలో పర్యాటకుల సందడి



ఉప్పాడ (కొత్తపల్లి), మే 18: ఉప్పాడ తీరం శనివారం పర్యాటకులతో సందడిగా మారింది. విపరీతమైన ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు సాయంత్రం 4 గంటల నుంచే ఉప్పాడ తీరానికి చేరుకున్నారు. చిన్నారులు,పెద్దలు సముద్ర కెరటాల్లో చల్లదనాన్ని ఆస్వాదిస్తూ కేరింతలు కొట్టారు. ఉప్పాడ నుంచి నేమాం వరకు తీరం పర్యాటకులతో సందడిగా మారింది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ హనుమంతరావు

గొల్లప్రోలు రూరల్, మే 18: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం అందరు వివాదాలు లేకుండా సోదరభావంతో మెలగాలని సూచించారు. వివాదాలు, ఘర్షణలకు దిగితే ఎన్నికల కేసులు నమోదు చేస్తామని, దీని వల్ల భవిష్యత్తులో పలు ఇబ్బందులు ఉంటాయన్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ భద్రత పరిశీలనకు కంట్రోల్‌రూమ్



సీసీ టీవీ కెమెరాల కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న జేసీ రామసుందరరెడ్డి

జాయింట్ కలెక్టర్ రామసుందరరెడ్డి

పిఠాపురం, మే 18: స్ట్రాంగ్‌రూమ్ భద్రతను పరిశీలించేందుకు గానూ సీసీటీవీ కెమేరాల కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని పిఠాపురం అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రామసుందరరెడ్డి తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూకేలోని క్యాంటీన్‌పై ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్‌రూమ్‌ను శనివారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జేఎన్‌టీయూకేలోని సెంట్రల్ లైబ్రరీలో పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రిని సురక్షితంగా భద్రపరచడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యరులు, వారి ఏజెంట్లు స్ట్రాంగ్‌రూమ్ భద్రతను పరిశీలించేందుకు సీసీ టీవీల వ్యూను చూసేందుకు గానూ క్యాంటీన్ పైన పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల సందర్శన

కార్పొరేషన్ (కాకినాడ), మే 18: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శనివారం ఈవీఎం, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను సందర్శించారు. రోజువారీ పర్యవేక్షణలో భాగంగా ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అక్కడకు వెళ్లిన ఆర్వో స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పర్యవేక్షించారు. ఆయన వెంట ఏఆర్వో చల్లన్నదొర, ఇతర అధికారులు ఉన్నారు.

'పెండింగ్ పనులకు నిధులు విడుదల చేయాలి'



కలెక్టర్ నివాస్‌ను కలిసిన నాయకులు

కలెక్టరేట్ (కాకినాడ), మే 18: కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని బీఆర్ అంబేడ్కర్ భావజాలకులు పిల్లి రామారావు, దంగేటి కుమార్‌బాబు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్ కలెక్టర్ నివాస్‌ను కోరారు. వారు కలెక్టరేట్‌లో ఆయన్ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ బాలుర హాస్టల్‌లో డైనింగ్ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులకు సంబంధించి రూ.35 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలన్నారు. హాస్టల్, మరుగుదొడ్ల మరమ్మతులకు రిలయన్స్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ సంస్థలు ఇస్తామన్నా నిధులను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ నివాస్ తెలిపారు.

ఓటింగ్ సరళిపై క్లస్టర్ వారీగా కొండబాబు సమీక్ష



ఓటింగ్ సరళి తెలుసుకుంటున్న కొండబాబు

కాకినాడ సిటీ, మే 18: నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్ సరళిపై క్లస్టర్ వారీగా కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వనమాడి కొండబాబు సమీక్ష చేశారు. శనివారం తన నివాసంలో క్లస్టర్ వారీగా డివిజన్ ఇన్చార్జ్‌లు, బూత్ ఇన్చార్జ్‌లు, క్లస్టర్ ఇన్చార్జిలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ వారీగా జరిగిన ఓటింగ్ సరళి, ఇతరత్రా అంశాలపై సమీక్ష జరిపారు. ఆయా ప్రాం తాల్లో నమోదైన ఓటింగ్ శాతం, టీడీపీ కూటమికి వచ్చే మెజారిటీ వంటి అంశాలను నమోదు చేసుకున్నారు. సమావేశంలో పార్టీ నగర కమిటీ నాయకులు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు

అభ్యర్థుల మెజార్టీతో పాటు పలు అంశాలపై పందేలు

ప్రత్తిపాడు, మే 18: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. అభ్యర్థుల గెలుపుపైనే కాకుండా, పలు రకాలుగా బెట్టింగ్ రాయుళ్లు పందేలు కాస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, జిల్లాలో ఎంపీగా జనసేన కూటమి అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్, ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా విజయం సాధిస్తారని మూడు అంశాల ప్రాతిపదికపై బెట్టింగ్‌లు జోరుగా కాస్తున్నారు. అలాగే లింగంపర్తి గ్రామంలో ఒక్క ఓటు అయినా టీడీపీకి మెజార్టీ వస్తుందని, ధర్మవరంలో టీడీపీకి 500 ఓట్లు మెజార్టీ వస్తుందనే దానిపై లక్షలాది రూపాయలు పందేలు వేశారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు 50 వేలు మెజార్టీ వస్తుందని ప్రత్తిపాడు మండలంలో జోరుగా పందేలు సాగాయి. అలాగే రాష్ట్రంలో టీడీపీకి 100 అసెంబ్లీ సీట్లు రావడమే లక్ష్యంగా పందేలు వేశారు. ప్రత్తిపాడులో కూటమి అభ్యర్థి సత్యప్రభకు 10వేల మెజార్టీపై కూడా పందేలు జోరుగా సాగుతున్నాయి.

కిర్లంపూడి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటర్ల తీర్పు బ్యాలెట్లలో నిక్షిప్తమై ఉంది. వచ్చే నెల 4న అభ్యర్థుల భవితవ్యం వెల్లడికానుంది. విజయం ఎవరిని వరిస్తుందోననే చర్చలు సర్వత్రా నడుస్తున్నాయి. మరో వైపు గెలుపు ఓటములపై బెట్టింగ్ జోరందుకు ంది. జగ్గంపేట నియోజకవర్గంలో కూటమి విజయం సాధిస్తుందని ఎక్కువ మంది పందేలకు ఎగబడడంతో మిగతా వారు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని చెప్పడంతో ఒక సైడే బెట్టింగ్‌కు ఎగబడుతున్నారు. వైసీపీకి వచ్చే స్థానాలపై పందేలు కాసేందుకు ఎదురుచూస్తున్నారు. వచ్చే నెల 4వ తేదీకి బెట్టింగులు తారాస్థాయికి చేరే అవకాశమున్నట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, మే 18: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,95,300, అన్నదాన విరాళాలు రూ.94,492, కేశఖండన ద్వారా రూ.11,400, తులాభారం రూ.400, కానుక ద్వారా రూ.3000 వెరసి రూ.4,04,592 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు తదితరులు ఉన్నారు.



స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు



ఆలయంలో విశేష పూజలు చేస్తున్న అధికారులు

సామర్లకోట, మే 18: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి శనివారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన సీనియర్ అధికారులు ఆండాళ్ళు, బాలసరస్వతి తదితరులు రాగా ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులచే సాదరంగా స్వాగతం పలికారు. ఉపాలయాలను దర్శించిన అధికారులు భీమేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నంది మండపం వద్ద ఆలయ పండితులచే వేదస్వస్తి పలికి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. సామర్లకోట వీఆర్వో నలజర్ల మురళీకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత జయంతి



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పిఠాపురం, మే 18: పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో కొలువయి ఉన్న వాసవి మాత జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భక్తులు ప్రత్యేక భజనలు చేశారు. అమ్మవారి పల్లకిసేవ పురవీధుల్లో సాగింది. వాసవి అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమాల్లో వాసవి మహిళా భక్త సమాజం సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట, మే 18: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వాసవి ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అమ్మవారిని పంచద్రవ్యములతో అభిషేకించి విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక రథంపై అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వాసవి వనితా క్లబ్, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, వాసవి యంగ్ బాయ్స్ పాల్గొన్నారు.

108 కలశాలతో ఊరేగింపు



ఏలేశ్వరంలో కలశాలతో ఊరేగింపు

ఏలేశ్వరం, మే 18: పట్టణంలో 108 కలశాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా కేరళ వాయిద్యాలతో మహిళలు, పిల్లలు 108 కలశాలతో ఏలేరు జలాలను బిందెలతో శివాలయం రోడ్డుమీదగా పలు వీధుల్లో ఊరేగిస్తూ తీసుకొచ్చి వాసవి మాతకు అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 3 ట్రాక్టర్లు సీజ్

గొల్లప్రోలు రూరల్, మే 18: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. పోలవరం గట్టును తవ్వి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు-దుర్గాడ రోడ్డులో గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 3ట్రాక్టర్లల్లో గ్రావెల్ తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చర్యలు తీసుకోవాల్సిందిగా మైన్స్ ఏడీకి లేఖ రాశారు.

జి.వేమవరంలో జోరుగా మట్టి తరలింపు

తాళ్లరేవు, మే 18: జి.వేమవరంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి ట్రాక్టర్లు జోరుగా తిరుగుతున్నాయి. మట్టిమాఫియా ట్రక్కు రూ.1500 నుంచి 1800వరకు వసూలు చేస్తూ జి.వేమవరం మెయిన్‌రోడ్డును ఛిద్రం చేస్తున్నారు. ప్రభుత్వాధికారులు మాఫీయాతో చేతులు కలిపి పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జి.వేమవరంలో మట్టిట్రాక్టర్లు ఎక్కువగా తిరగడం వల్ల వాటి నుంచి తప్పుకునేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి ట్రాక్టర్లను అదుపుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికల సంరక్షణపై శ్రద్ధ వహించాలి



బాలికల చట్టాలపై వివరిస్తున్న వెంకటరావు

తాళ్లరేవు, మే 18: బాలికల సంరక్షణపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలని... మహిళలు,బాలికల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని బాలికల సంరక్షణ జిల్లా అధికారి వెంకటరావు అన్నారు. శనివారం తాళ్లరేవు బీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన చైల్డ్‌ప్రొటెక్ట్ యాక్టులపై సమావేశం జరిగింది. బాలికలు, మహిళలు కోసం ఉన్న రక్షణ చట్టాలపై వివరించారు. న్యాయవాది వాసం శెట్టి జాన్సీ, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష



ప్రత్తిపాడు, మే 18: ప్రత్తిపాడులో పెద్దాపురం ఉప విద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు సమీక్షించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై నాడు-నేడు పనులు సత్వరం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ బిల్లుల మంజూరుకు సంబంధించి చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలల పునఃప్రారంభ సమయానికి తీసుకోవాల్సిన చర్యలను హెచ్ఎంలకు వివరించారు. సమావేశంలో ఎంఈవోలు వి.రాజబాబు, వై.అచ్చిరాజు తదితరులున్నారు.

గ్రామదేవతకు వెండి వడ్డాణం వితరణ



కరప, మే 18: కరప గ్రామదేవత ఉప్పాలమ్మతల్లికి దాతలు శనివారం 812 గ్రాముల వెండి వడ్డాణాన్ని వితరణ చేశారు. గ్రామానికి చెందిన ఉండమట్ల సూర్యప్రకాశ్‌రావు, చిట్టిమణి దంపతుల కుమారుడు ముద్దుకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి వెండి వడ్డాణం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ వెండి ఆభ రణాలను స్వీకరించి అమ్మవారికి సమర్పించారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

గంగాలమ్మ గావు సంబరం

ప్రత్తిపాడు, మే 18: ప్రత్తిపాడులో శనివారం గంగాలమ్మ గావు సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక వేగులమ్మ గుడి సమీప వీధిలో ఉన్న గంగాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తప్పెడుగుళ్ళ ప్రదర్శనలతో సంబరాన్ని నిర్వహించి అనంతరం భారీ అన్నదానం చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సర్పవరం జంక్షన్, మే 18: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో రిటైర్డు తహశీల్దార్ రేలంగి బాపిరాజు ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులను జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. బాపిరాజు సేవలను కొనియాడారు. ట్రస్ట్ అధ్యక్షులు అడబాల రత్నప్రసాదరావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు ఉన్నారు.